సాక్షి
జనగామ
ఆదివారం | 19 | మే | 2024



వీసీపై విజిలెన్స్
యూనివర్సిటీలో అక్రమ నియామకాలు తదితర ఆరోపణల నేపథ్యంలో కేయూ వీసీ తాటికొండ రమేశ్‌పై సమగ్ర విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. - 8లో▸



వాసవీమాత జయంతి
ఆర్య వైశ్యుల ఇలవేల్పు వాసవీమాత జయంతి వేడుకలను శనివారం జిల్లా వ్యాప్తంగా వైభవంగా నిర్వహించారు. అమ్మవారి చిత్రపటాలను అలంకరించి పూజలు చేశారు. - 9లో▸

గరిష్టం/కనిష్టం
$34^0/25^0$

వాతావరణం
ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అధిక శాతం మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రాత్రి పూట ఉక్కపోత మామూలుగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వైభవంగా వార కల్యాణం



చిల్పూరు: శ్రీ బుగులు వేంకటేశ్వరాలయంలో శనివారం స్వామివారికి వార కల్యాణం వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దర్శనానికి క్యూలైన్‌లో అరగంట పాటు వేచి ఉన్నారు. కల్యాణం అనంతరం ధర్మసాగర్‌కు చెందిన తిరునగరి హరినాథ్‌–శ్రీనిధి భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. ఈఓ లక్ష్మీప్రసన్న పర్యవేక్షించారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రఘునాథపల్లి: నిడిగొండలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి అధ్యయనోత్సవ, బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. 19 నుంచి ఐదు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. 21న శ్రీవారి కల్యాణ మహోత్సవం, 22న మహా పూర్ణాహుతితో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయని వేద పండితులు కృష్ణమాచారి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

పోతన స్మారక మందిరం సందర్శన




పాలకుర్తి: ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన బమ్మెర పోతన స్మారక మందిరాన్ని టీఎస్‌ఈఆర్‌సీ రాష్ట్ర చైర్మన్ తన్నీరు రంగారావు శనివారం సందర్శించారు. అనంతరం ఆయనను స్థానిక విద్యుత్ కార్యాలయంలో సిబ్బంది శాలువాతో సత్కరించారు. చైర్మన్ వెంట ఏడీఈ తిలక్, ఏఈ రణధీర్, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రసవం తర్వాత 'రేవంతన్న కిట్' ఇవ్వాలి



జనగామ: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం తర్వాత బాలింతలకు రేవంతన్న పేరిట కిట్ అందించాలని జనగామ మున్సిపల్ కాంగ్రెస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గాదెపాక రాంచందర్ కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రికి శనివారం స్పీడ్ పోస్టులో లేఖ పంపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కేసీఆర్ కిట్ ఇవ్వడం వల్ల సర్కారు ఆస్పత్రుల్లో డెలివరీలు పెరిగాయని, కిట్ల పంపిణీ నిలిచిపోయిన తర్వాత మహిళలు డెలివరీలకు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారని పేర్కొన్నారు. 'రేవంతన్న కిట్'గా మార్చి పంపిణీ చేస్తే ప్రతిపక్షాలు విమర్శించడానికి అవకాశం ఉండదన్నారు. అలాగే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే అమ్మాయిలతో పాటు 60 ఏళ్లు దాటిన వృద్ధ మహిళలకు మాత్రమే ఉచిత ప్రయాణం సమంజసమన్నారు.

'గ్రూప్‌–1' పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



జనగామ: గ్రూప్‌–1 ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని టీఎస్ పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. జూన్ 9న నిర్వహించే గ్రూప్‌–1 ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించి శనివారం ఆయన హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లు, డీసీపీ, ఏసీపీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సెంటర్లలో అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన వసతి సౌకర్యాలు కల్పించాలని, పరీక్ష నిర్వహణలో నిర్లక్ష్యం కనిపిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సెంటర్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ఓఎంఆర్ షీట్లు, ప్రశ్నపత్రాలను ఆయా పోలీస్ హెడ్‌క్వార్టర్లలో తగిన బందోబస్తు మధ్య ఉంచాలన్నారు. పరీక్ష ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందని, అభ్యర్థులను ఉదయం 9 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతించాలని తెలిపారు. సెల్ ఫోన్లతో పాటు ఎలక్ట్రానిక్ తదితర వస్తువులను అనుమతించొద్దన్నారు. ఇన్విజిలేటర్లు సైతం సెల్‌ఫోన్లు తీసుకెళ్లకుండా ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, ఏసీపీ అంకిత్‌కుమార్ తదితర జిల్లా ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

గాడితప్పిన టౌన్ ప్లానింగ్

- మెడికల్ లీవ్‌లో టీపీఓ.. ఎలక్షన్ డ్యూటీపై టీపీఎస్
- ఇంటి నిర్మాణ అనుమతులు కంప్యూటర్‌కే పరిమితం
- ఎంక్రోచ్‌మెంట్లపై పర్యవేక్షణ కరువు
- పురపాలిక స్థలాల పరిరక్షణ బాధ్యత ఎవరిది..?



జనగామ మున్సిపాలిటీలో అధికారులు లేక ఖాళీగా ఉన్న టౌన్ ప్లానింగ్ చాంబర్

జనగామ: జనగామ పురపాలిక పట్టణ ప్రణాళిక విభాగం పాలన గాడితప్పింది. ఇంటి అనుమతుల కోసం ప్రజలు నెలల తరబడి అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరికీ పట్టడం లేదు. రేపు.. మాపు అంటూ కాలయాపన చేస్తున్నారు. టీపీఓ మెడికల్ లీవ్‌పై వెళ్లాడు. ఎలక్షన్ ఆన్‌డ్యూటీపై వెళ్లిన ఇన్‌చార్జ్ టీపీఎస్ ఎన్నికలు ముగిసి ఐదు రోజులు గడిచినా విధుల్లో చేరలేదు. దీంతో గృహనిర్మాణ అనుమతులు కంప్యూటర్‌కే పరిమితమయ్యాయి. ఇటీవల జనగామకు వచ్చిన టీపీఓ, సెక్షన్ ఆఫీసర్లు పట్టుమని పదిరోజులు కూడా ఉండడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఇళ్ల అనుమతుల కోసం 'లీడర్లు'గా చెప్పుకునే కొందరి ఒత్తిడితోనే ఉద్యోగులు ఇక్కడ పనిచేయడం లేదనే చర్చ జరుగుతోంది.

బదిలీలు.. మెడికల్ లీవులు

మున్సిపల్‌కు పట్టణ ప్రణాళిక విభాగం పట్టుకొమ్మలాంటిది. పురపాలిక ఆదాయంలో టౌన్‌ప్లానింగ్ శాఖ కీలకం. కొత్త నిర్మాణాల విషయంలో జాప్యం లేకుండా ఇంటి నంబర్ కేటాయిస్తూ ఆస్తిపన్ను పరిధిలోకి తీసుకువచ్చే గురుతర బాధ్యత పట్టణ ప్రణాళిక శాఖ అధికారులపై ఉంటుంది. అయితే ఇక్కడ అధికారుల కంటే.. లీడర్ల పెత్తనమే నడుస్తోంది. అడ్డగోలు పనుల కోసం అధికారులపై ఒత్తిడి చేస్తుండడంతో ఇక్కడ పనిచేయాలంటేనే వణికి పోతున్నారు. పోస్టింగ్‌ల సమయంలో జనగామ పేరు ఎత్తితేనే ఒకటికి రెండు సార్లు ఆలోచించే పరిస్థితి నెలకొందనే చర్చ జరుగుతోంది. గతంలో సుదీర్ఘ కాలం పని చేసిన టీపీఓలు సైతం బలవంతంగా బదిలీ చేసుకోగా.. ఇటీవల వచ్చిన వారు సైతం మెడికల్ లీవ్‌ల సాకుతో వెళ్లిపోయి.. మరో చోటుకు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. ప్రస్తుతం పని చేస్తున్న శ్రీధర్ అనారోగ్య కారణాలతో మెడికల్ లీవ్‌పై విధులకు దూరంగా ఉన్నాడు. ఆయన కొంత కాలంగా తన సెలవులను పొడిగించుకుంటూ వస్తున్నాడు. నిజాంపేట కార్పొరేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న టీపీఎస్‌కు వారంలో మూడు రోజులు పని చేసేలా జనగామకు పోస్టింగ్ ఇచ్చారు. ఎలక్షన్ డ్యూటీలో వెళ్లిన టీపీఎస్.. ఎన్నికలు ముగిసి ఐదు రోజులు గడిచినా విధులకు హాజరు కాలేదు. దీంతో ఇంటి అనుమతులు, కరెక్షన్లు, ఇతర పనుల కోసం లీడర్లుగా చెప్పుకునే పలువురు నిత్యం ఇక్కడే అడ్డా వేస్తూ.. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న ఓ వ్యక్తిని మచ్చిక చేసుకుని బేరసారాలతో పనులు చేయించుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.



30 అనుమతులకు పైనే..

టీపీఓ, టీపీఎస్ ఇద్దరూ లేక పోవడంతో ఆన్‌లైన్‌లో వచ్చిన సుమారు 30కి పైగానే ఇంటి అనుమతులు కంప్యూటర్‌కే పరిమితమయ్యాయి. దీంతో గృహ నిర్మాణం చేసుకునే కుటుంబాలు రోజూ మున్సిపల్ చుట్టూ తిరుగుతున్నారు. నూతన నిర్మాణాలకు అనుమతులతో పాటు ఇంటి నంబర్ల కేటాయింపుతో పురపాలికకు ఆదాయం పెరుగుతుంది. ఇక గతంలోనే నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఓనర్లు.. ఇంటి నంబర్ల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

కలెక్టర్‌కు పట్టింపేది..!

గడిచిన మూడేళ్లకు సంబంధించి పెండింగ్‌లో ఆడిట్ రిపోర్టు.. అడ్డగోలుగా పనులు.. నిలువునా చీలిపోతున్న సీసీ రోడ్లు.. ఖాళీ అయిన టౌన్‌ప్లానింగ్ శాఖ.. నిత్యం ప్రజలతో సంబంధాలు కలిగిన పురపాలికపై కలెక్టర్ పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు వస్తున్నాయి. శానిటేషన్, ఎంక్రోచ్‌మెంట్లపై వస్తున్న ఫిర్యాదులు, డ్రెయినేజీల నిర్వహణ ఇలా చెప్పుకుంటూ పోతే అనేక సమస్యలు మున్సిపల్‌ను పీడిస్తున్నాయి.

పెండింగ్‌లో దరఖాస్తులు..



నూతన ఇంటి నిర్మాణాల కోసం వచ్చిన సుమారు 30 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మెడికల్ లీవ్‌లో టీపీఓ, ఎన్నికల విధుల్లో టీపీఎస్ వెళ్లారు. ఇద్దరూ లేకపోవడంతో నిర్మాణ అనుమతులు ఆగిపోయాయి. ఇబ్బందులు లేకుండా ఎలా అనే దానిపై ఆలోచన చేస్తున్నాం.

- వెంకటేశ్వర్లు,
జనగామ మున్సిపల్ కమిషనర్

ఎమ్మెల్సీ ఎన్నిక పకడ్బందీగా నిర్వహించాలి

- సమీక్షలో కలెక్టర్ రిజ్వాన్ బాషా



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో ఈ నెల 27న జరిగే పోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణ, పోస్టల్ బ్యాలెట్‌పై సెక్టార్ అధికారులు, పీఓలు, ఏపీఓలతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. జిల్లాలో 23,419 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారని, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ల పరిధిలో 27 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలింగ్‌కు రెండు రోజుల ముందు (25న) సెక్టార్ అధికారులు కేంద్రాలను సందర్శించి అక్కడ కల్పించిన మౌలిక వసతులను సరిచూసుకోవాలన్నారు. సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బ్యాలెట్ పద్ధతిలో జరిగే పోలింగ్ సందర్భంగా అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ విధుల్లో ఉన్న అధికారులకు మాత్రమే పోస్టల్ బ్యాలెట్ ఇస్తామని, కలెక్టర్‌లో ఏర్పాటు చేసే ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్లను స్వీకరిస్తామని తెలిపారు. అంతకు ముందు పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ విధానంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ అనిల్‌కుమార్, జనగామ, స్టేషన్ ఘనపూర్ ఆర్డీఓలు కొమురయ్య, డీఎస్ వెంకన్న పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. గ్రీవెన్స్, ధరణి పెండింగ్ దరఖాస్తులను వేగంగా క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

బీజేపీకి అనుకూల వాతావరణం

- ప్రేమేందర్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలి
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హన్మకొండ: బీజేపీకి అనుకూల వాతావరణం ఉందని, ఎమ్మెల్సీ ఎన్నికలో పార్టీ అభ్యర్థి గెలుస్తారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ హంటర్ రోడ్డులోని సత్యం కన్వెన్షన్‌లో కేజీ టు పీజీ విద్యా సంస్థల యాజమాన్యాల ఆత్మీయ సమ్మేళనం, డి కన్వెన్షన్‌లో బీజేపీ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరైన కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై దిశా నిర్దేశం చేశారు. ప్రశ్నించే గొంతుకైన బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రతీ కార్యకర్త తానే అభ్యర్థిగా భావించి పని చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఓటరును కలిసి ఓటు వేసే విధానంతో పాటు బీజేపీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో నిర్మాణాత్మక ప్రతిపక్షంగా బీజేపీ పని చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు చెల్లిస్తుంటే రాష్ట్రాలు వాటిని దారి మళ్లిస్తున్నాయన్నారు. ఈక్రమంలో కేంద్రం నేరుగా విద్యార్థి ఖాతాలోనే ఉపకార వేతనాలు జమ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. కానీ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల వివరాలు పంపించలేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్య శ్రీ, కాంట్రాక్టర్లకు చెల్లించాల్సినవి రూ.వేల కోట్ల బకాయిలున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నిక ఇన్‌చార్జ్ రాంచందర్‌రావు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు యెండల లక్ష్మీనారాయణ, మార్తినేని ధర్మారావు, కొండేటి శ్రీధర్, వన్నాల శ్రీరాములు, ఒంటేరు జయపాల్, జిల్లా అధ్యక్షులు రావు పద్మ, గంట రవికుమార్, ఎంపీ అభ్యర్థులు అరూరి రమేశ్, ప్రొఫెసర్ ఆజ్మీరా సీతారాం నాయక్, వరంగల్ పార్లమెంట్ ప్రభారి వి.మురళీధర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్సీ జనార్దన్ రెడ్డి, విద్యా సంస్థల ప్రతినిధులు బుచ్చిబాబు, అశోక్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓరుగల్లు మాణిక్యాలు

మధ్య తరగతి కుటుంబంలో విద్యా కుసుమాలు వికసించాయి. కఠోర శ్రమ, అంకుఠిత దీక్షతో విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నారు. ఈఏపీసెట్ ఫలితాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మెరిశారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీలో మెరుగైన ర్యాంకులు సాధించి జిల్లా పేరును నిలబెట్టారు. హనుమకొండ రెడ్డికాలనీకి చెందిన శ్రీవర్షిణి రాష్ట్రస్థాయిలో (అగ్రికల్చర్, ఫార్మసీ) 3వ ర్యాంకు, జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లికి చెందిన కొంతం మణితేజ 9వ ర్యాంకు (ఇంజనీరింగ్) సాధించారు.

– స్టేషన్‌ఘన్‌పూర్/హన్మకొండ చౌరస్తా

ఈఏపీసెట్‌లో మనోళ్లకు స్టేట్ ర్యాంక్‌లు

- అగ్రికల్చర్, ఫార్మసీలో శ్రీవర్షిణికి 3వ ర్యాంక్
- ఇంజనీరింగ్‌లో కొంతం మణితేజకు 9వ ర్యాంక్
- తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చిన విద్యార్థులు
- అభినందనలతో ముంచెత్తిన స్థానికులు, బంధువులు

తండ్రి ప్రైవేట్ ఉద్యోగి, తల్లి టైలర్

జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లికి చెందిన కొంతం వేణుగోపాల్, లలిత కుమారుడు మణితేజ. 1 నుంచి ఆరో తరగతి వరకు స్థానిక ప్రైవేట్ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంలో చదివాడు. వేణుగోపాల్ పిల్లల చదువు కోసం ఆరేళ్ల క్రితం హైదరాబాద్‌కు భార్యా పిల్లలతో వెళ్లాడు. అక్కడే ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ.. భార్య లలిత ఇంటి వద్ద మిషన్ కుడుతూ పిల్లలను చదివించారు. ఈక్రమంలో మణితేజ 6 నుంచి పదోతరగతి వరకు హైదరాబాద్‌లోని ప్రైవేట్ స్కూల్‌లో చదివాడు. పదోతరగతిలో 8.2 జీపీఏ మార్కులు సాధించిన మణితేజ ఇంటర్ హైదరాబాద్ కూకట్‌పల్లి ఎస్‌ఆర్ శ్రీగాయత్రి కళాశాలలో ఎంపీసీ చదివాడు. ఇంటర్‌లో 715 మార్కులు సాధించాడు. కాగా ఈఏపీసెట్‌లో ఉత్తమ ప్రతిభతో రాష్ట్రస్థాయిలో 9వ ర్యాంకు సాధించి అందరి మన్ననలు పొందాడు. స్టేట్ ర్యాంక్ సాధించిన మణితేజను శివునిపల్లి వాసులు, స్నేహితులు, బంధువులు అభినందించారు.



తల్లిదండ్రులతో మణితేజ

పిల్లల చదువు కోసమే హైదరాబాద్‌కు..

ఊళ్లో సరైన పని దొరకలేదు. జీవనోపాధి కోసం, పిల్లల చదువుల కోసం ఆరేళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చాం. నేను ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నా. నా భార్య మిషన్ కుడుతోంది. మణితేజ, కుమార్తె మానసను కష్టపడి చదివిస్తున్నాం. మణితేజకు పదవ తరగతిలో అనుకున్నన్ని మార్కులు రాలేదు. చదువు విలువను తెలిపి పిల్లలను మోటివేట్ చేశాం. ఐదేళ్లు కష్టపడి చదివితే భవిష్యత్ బాగుంటుందని చెప్పేవాళ్లం. ఈఏపీసెట్‌లో 9వ ర్యాంక్ రావడం సంతోషంగా ఉంది.

- కొంతం వేణుగోపాల్, మణితేజ తండ్రి

స్కూల్ స్థాయి నుంచి టాపరే..



అమ్మానాన్నతో గద్దం శ్రీవర్షిణి

హనుమకొండలోని రెడ్డి కాలనీకి చెందిన గద్దం శ్రీవర్షిణి అగ్రికల్చర్, ఫార్మసీలో (హాల్ టికెట్ నంబర్ 2411ఆర్09048, మార్కులు 145.255026) రాష్ట్రస్థాయిలో మూడవ ర్యాంకు సాధించింది. అప్పటి వరకు ఇరుగుపొరుగు వారికి అంతంత మాత్రంగానే తెలిసిన శ్రీవర్షిణి సింగిల్ డిజిట్ ర్యాంక్ సాధించడంతో కాలనీవాసుల అభినందనలతో తల్లిదండ్రులు మురిసిపోయారు. గద్దం కన్నయ్య, లావణ్య దంపతుల కుమార్తె శ్రీవర్షిణి, కుమారుడు ఫణితేజ. ఫణితేజ కర్ణాటకలోని ధార్వాడలో ఐఐటీ పూర్తి చేసి ప్రస్తుతం బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. కన్నయ్య ప్రైవేట్ సంస్థలో మార్కెటింగ్ ఉద్యోగం చేస్తుండగా.. తల్లి లావణ్య గృహిణి. శ్రీవర్షిణి పదో తరగతి వరకు ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదివి 10/10 మార్కులు సాధించింది. హైదరాబాద్‌లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివి 987 మార్కులు తెచ్చుకుంది. శ్రీవర్షిణి ఇటీవల నీట్ రాసింది. అందులోనూ 200లోపు ర్యాంక్ వస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేసింది.

కూతుర్ని డాక్టర్‌గా చూడాలి..

మాది మధ్య తరగతి కుటుంబం. పిల్లలు చదువుల్లో రాణిస్తే అంతకంటే తల్లిదండ్రులకు ఏముంటుంది. వర్షిణి మొదటి నుంచి చదువులో మేటి. కుమారుడు ప్రయోజకుడయ్యాడు. కూతురు శ్రీవర్షిణిని డాక్టర్‌గా చూడాలన్నది మా కోరిక. ఈవిషయం ఎప్పుడూ చెప్పేవాళ్లం. మా ఆకాంక్షలకు అనుగుణంగా చదివింది. రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంక్ సాధించింది. నిన్నమొన్నటి వరకు పక్క వీధికి కూడా తెలియని మా అమ్మాయి ఇప్పుడు రాష్ట్రమంతా తెలిసింది. ఎంతో సంతోషంగా ఉంది.

- గద్దం కన్నయ్య, లావణ్య వర్షిణి తల్లిదండ్రులు

కేసీఆర్ జైలు ఊచలు లెక్కపెట్టాల్సిందే

- ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కొమ్మూరి, బల్మూరి, మల్లన్న

జనగామ: అధికార దుర్వినియోగానికి పాల్పడిన మాజీ సీఎం కేసీఆర్ జైలు ఊచలు లెక్కపెట్టక తప్పదని వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని విజయ ఫంక్షన్ హాల్‌లో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంత్రి కావడానికే ఎమ్మెల్సీ పదవిని పక్కన బెట్టి జనగామ నుంచి పోటీ చేశారని, ఆయన సృష్టించిన దొంగ ఓట్లతో ప్రతాప్‌రెడ్డిని ఓడించారే తప్ప.. నైతికంగా కొమ్మూరిదే విజయమని పేర్కొన్నారు. దీనిపై ప్రతాప్‌రెడ్డి కోర్టులో పిటిషన్ వేశారని, పల్లా జైలుకు వెళ్లడం ఖాయమని చెప్పారు. పట్టభద్రుల తరఫున కొట్లాడతాడని పల్లాను గెలిపిస్తే మూడేళ్లకే పదవిని వదిలి నమ్ముకున్న వారిని మోసం చేశాడని ధ్వజమెత్తారు. జూన్ 4 తర్వాత రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పదం వినిపించదని, ఆ పార్టీ నాయకులు ఓటు కోసం వస్తే.. ఉప ఎన్నిక ఎందుకు వచ్చిందో నిలదీయాలని పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ అరాచకాలను ప్రజలకు చేరవేయడంలో ముఖ్య పాత్ర పోషించిన తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. సమాజంలోని ప్రతీ సమస్య తెలిసిన వ్యక్తి తీన్మార్ మల్లన్న.. ఆయన ఎమ్మెల్సీగా గెలుపొందితే మంచి జరుగుతుందన్నారు. అంతకు ముందు ప్రచార పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వంగాల కల్యాణిమల్లారెడ్డి, టీపీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బనుక శివరాజ్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, లింగాల నర్సిరెడ్డి, డాక్టర్ రాజమౌళి, గాదెపాక రామచందర్, చెంచారపు బుచ్చి రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తొమ్మిది మంది డీబార్

కేయూ క్యాంపస్: కేయూ పరిధి హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన డిగ్రీ మొదటి సంవత్సరం, బీకాం, బీఎస్సీ ఫిజికల్ సైన్స్ పరీక్షల్లో కాపీయింగ్ చేస్తూ 9మంది పట్టుబడ్డారు. వారిని డీబార్ చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

ఆగిన రైళ్లు.. పోయిన ఆదాయం

ఖమ్మం జిల్లా మధిరలో చేపట్టిన రైల్వే‌ట్రాక్ పనుల నేపథ్యంలో ఆరు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు రద్దు చేశారు. దీంతో జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌కు వచ్చే ప్రయాణికుల సంఖ్య ఒక్కసారిగా తగ్గిపోయింది. వారిపైనే ఆధారపడ్డ ఫుట్‌పాత్, చిరు వ్యాపారులు డీలా పడ్డారు. శనివారం మధ్యాహ్నం పల్లీ, బఠాణీలు అమ్ముకునే ఓ అవ్వ వ్యాపారం లేక రోడ్డుపైనే నిద్రిస్తున్న దృశ్యం ప్రతి ఒక్కరిని కదిలించింది.

– జనగామ



రైల్వేస్టేషన్ ఆవరణలోని రోడ్డుపైనే నిద్రిస్తున్న అవ్వ



క్లుప్తంగా

360 కిలోల నల్లబెల్లం పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సీఐ చిరంజీవి

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఈదులపూసపల్లి, సీత్లాతండా, వేమునూరు, చిన్నలింగ్య తండా పరిధిలో గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. దాడుల్లో 360 కిలోల నల్లబెల్లం, 15 లీటర్ల గుడుంబా, 15 కిలోల పటిక, 3 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. 500 లీటర్ల పులియబెట్టిన బెల్లం పానకం పారబోసి ధరంసోత్ లక్ష్మణ్, అజ్మీరా ప్రవీణ్, అజ్మీరా నవీన్, బానోత్ అనిల్‌పై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ చిరంజీవి, ఎస్సై అశోక్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ మధు, కానిస్టేబుళ్లు యాదగిరి, శ్రీనివాస్, శేఖర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న పసికందు మృతి

- వైద్యురాలిపై పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు

వర్ధన్నపేట: చికిత్స పొందుతున్న ఓ పసికందు మృతి చెందాడు. ఎస్సై కథనం ప్రకారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలానికి చెందిన కసిరెడ్డి బేబి రెండు నెలల నుంచి వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చెకప్ చేయించుకుంటోంది. ఈ నెల 16న బేబికి నొప్పులు రావడంతో ఆస్పత్రికి వెళ్లగా అడ్మిట్ చేసుకున్నారు. 17వ తేదీన మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతలో బేబికి నొప్పులు తీవ్రం కావడంతో భర్త కసిరెడ్డి నరేష్ డ్యూటీలో ఉన్న గైనకాలజిస్ట్ మానసరెడ్డి దగ్గరికి వెళ్లి పరిస్థితిని వివరించాడు. ఆమె నిర్లక్ష్యంగా వ్యవహరించి బయటకు వెళ్లింది. స్టాఫ్‌నర్స్ సునీత, ఏఎన్‌ఎం సుభద్ర మధ్యాహ్నం 3.30 గంటలకు గైనకాలజిస్ట్ మానసరెడ్డితో మాట్లాడి డెలవరీ రూంకు తీసుకెళ్లగా మగశిశువుకు జన్మనిచ్చింది. శిశువును చూపించకుండా వెంటనే అంబులెన్స్‌లో ఎంజీఎం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పసికందు శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. సర్జరీ చేయాలని కోరినా వైద్యురాలి నిర్లక్ష్యం వ్యవహరించారని, ఆమె కారణంగా తమ శిశువు మృతిచెందినట్లు నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యూనివర్సిటీలో అవకతవకలపై 'సాక్షి' కథనాలు

కాకతీయ యూనివర్సిటీలో వీసీ రమేశ్ అసంబద్ధ పాలన, అక్రమాలపై ఎప్పటికప్పుడు 'సాక్షి' ప్రత్యేక కథనాలు ప్రచురించింది. ఉద్యోగులు, స్థానిక సమస్యలు పట్టించుకోకుండా లాడ్జి నుంచి వీసీ పాలన సాగిస్తున్నారని, న్యాక్ బృందం సమయంలో తప్పుడు సమాచారం ఇవ్వడం, అర్హులైన ప్రొఫెసర్లకు పదోన్నతులు ఇవ్వకుండా జాప్యం, అనర్హులకు ఇవ్వడం, ఆయనకు అనుకూలమైన వ్యక్తికి మూడు విభాగాల్లో ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడం, చివరికి ఏసీబీకి చిక్కడం, ఆన్సర్‌షీట్ల డిజిటలైజేషన్ టెండర్ తక్కువ కోట్ చేసిన వారికి ఇవ్వడం తదితర అంశాలపై 'సాక్షి' కథనాలు ప్రచురించింది. వీటిని కూడా అకుట్ రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లింది. ఈ నేపథ్యంలో వీసీపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది.



పాలకమండలికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలే..

గత మూడేళ్లలో వీసీ ప్రొఫెసర్ రమేశ్ విద్యార్థి వ్యతిరేక విధానాలు అనుసరిస్తూ అనేక అక్రమాలకు పాల్పడ్డారు. దీనిపై అనేకసార్లు గతంలో పాలకమండలికి ఫిర్యాదు చేశాం. అయినా పట్టించుకోలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో చివరకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించాల్సి వచ్చింది. ప్రభుత్వం స్పందించి విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. విచారణలో నిజానిజాలు నిగ్గు తేలుస్తారన్న నమ్మకం ఉంది. - మామిడాల ఇస్తారి, అకుట్ జనరల్ సెక్రటరీ

వీసీపై విజిలెన్స్

కేయూ వైస్ చాన్స్‌లర్ రమేశ్‌పై సమగ్ర విచారణకు ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం

'అకుట్' ఫిర్యాదుతో ఆదేశాలు జారీ

- యూనివర్సిటీలో అక్రమ నియామకాలు
- గిట్టని వారిపై కక్షసాధింపు చర్యలు
- యూనివర్సిటీకి రాకుండా లాడ్జి నుంచే పాలనపై విమర్శలు
- వివిధ విభాగాల్లో అవకతవకలపై వెల్లువెత్తిన ఆరోపణలు
- వీసీ వ్యవహార శైలిపై 'సాక్షి'లో పలు కథనాలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ వీసీ తాటికొండ రమేశ్ మూడేళ్లుగా ఇష్టారాజ్యంగా పాలన కొనసాగించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే. ఆయన బాధ్యతలు స్వీకరించి ఈనెల 21వ తేదీతో మూడేళ్లు పూర్తవుతాయి. ఈ నేపథ్యంలో పెద్ద షాక్ తగిలింది. వీసీపై వచ్చిన ఆరోపణలను నిగ్గుతేల్చాలని విజిలెన్స్ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వివాదాస్పద నిర్ణయాలతో పాలన సాగిస్తున్నారంటూ ఉద్యోగులు, అధ్యాపకులు, విద్యార్థుల్లో అసంతృప్తి నెలకొంది. రోజూ ఆందోళన జరగడం సాధారణమైంది. పాలనను పట్టించుకోకుండా ఆయన వ్యవహార శైలి, యూనివర్సిటీలో జరుగుతున్న అవకతవకలు, అక్రమాలపై 'సాక్షి'లో పలుమార్లు కథనాలు వచ్చాయి. వీటన్నింటినీ కాకతీయ యూనివర్సిటీ అసోసియేషన్ ఆఫ్ టీచర్స్ (అకుట్) బాధ్యులు కూడా పలుసార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రభుత్వం స్పందించింది. గత జనవరి 14న, 24న సీఎం రేవంత్ రెడ్డి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంలకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ విజిలెన్స్ విచారణకు శనివారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వీసీ రమేశ్ గత మూడేళ్లలో అనేక అక్రమాలు, అవకతవకలకు పాల్పడ్డారని, నాలుగు అంశాలను పేర్కొంటూ, వాటిపై విచారణ జరపాలని ఉత్తర్వులు జారీ చేసింది. టర్మినేట్ అయిన పలువురు ఫ్యాకల్టీలను చట్టవిరుద్ధంగా కొనసాగిస్తున్నారని, అక్రమ బదిలీలు చేస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా అకడమిక్ నియామకాలు చేపట్టారని, ఫేక్ ప్రాజెక్టులకు కూడా అనుమతి, రూపకల్పన చేశారని ఆరోపణలపై విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించి నివేదిక ఇవ్వాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. కాగా, అకుట్ వివిధ అంశాలతో కూడిన 150 పేజీల ఫిర్యాదు అందించింది.

ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు..

- ప్రభుత్వ ఉత్తర్వులు ధిక్కరిస్తూ యూనివర్సిటీ చట్టానికి వ్యతిరేకంగా, యూజీసీ నిబంధనలను తుంగలో తొక్కి 16 మంది రిటైర్డ్ ఆచార్యులను నియమించారని అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. వారికి ప్రతినెలా వేతనం కింద రూ.8లక్షలు చెల్లించారు. వారి సేవలను కూడా సక్రమంగా వినియోగించుకోలేదని విమర్శలు వచ్చాయి. అకుట్ కూడా పలుమార్లు ఫిర్యాదు చేసింది. అకుట్ జనరల్ సెక్రటరీ మామిడాల ఇస్తారి కూడా హైదరాబాద్‌లో విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత అడ్జంట్ ప్రొఫెసర్లను ఆ విధుల నుంచి రిలీవ్ చేసిన విషయం విదితమే.
- వీసీ తాటికొండ రమేశ్, అప్పటి రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందడం కూడా అక్రమమనే ఆరోపణలు వెల్లువెత్తాయి. వీసీ పదోన్నతికి సంబంధించిన ప్రొసీడింగ్స్‌కు పూర్తిస్థాయి పాలకమండలి ఆమోదం లేదని, ప్రొఫెసర్ పదోన్నతి కూడా చెల్లదని ప్రభుత్వానికి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.
- వీసీ నియామకానికి పదేళ్ల ప్రొఫెసర్ అనుభవం తప్పనిసరి అని యూజీసీ నిబంధనలు చెబుతున్నాయి. కానీ, అంత అనుభవం లేని రమేశ్‌ను వీసీగా నియమించారని, ఆయన పాలనతో అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని, వ్యక్తిగత కక్షలకు పాల్పడుతూ అక్రమ బదిలీలు, డిప్యూటేషన్లు చేశారన్నది కూడా ప్రధాన ఆరోపణ.
- వీసీ తన అనర్హత కేసు వాదించేందుకు సంబంధం లేని అడ్వకేట్‌కు డబ్బులు చెల్లించారని, వర్సిటీ తరఫునుంచి వాదించేందుకు స్టాండింగ్ కౌన్సిల్ ఉండగా, అదనంగా మరో అడ్వకేట్‌తో వకాలత్ వేయించారన్నది మరో ఆరోపణ ఉంది. నెల రోజులుగా ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ అక్రమంగా తన ఇష్టానుసారంగా బదిలీలతోపాటు పాలనా పదవుల్లో కొందరిని నియమిస్తూ పక్షపాత వైఖరిని ప్రదర్శించారని ఫిర్యాదులో వివరించారు.
- కాకతీయ యూనివర్సిటీలోని భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోలేదని, అందులో ఓ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఇల్లు కూడా ఉందనేది ఆరోపణలు ఉన్నాయి. కానీ, ఇప్పటివరకు ఆ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌పై వీసీ ఎలాంటి చర్యలూ చేపట్టలేదని, అంతే కాకుండా అతడిని ప్రోత్సహిస్తూ పాలన కొనసాగించారని, దీంతో ఫిర్యాదు చేయాల్సి వచ్చిందని అకుట్ జనరల్ సెక్రటరీ మామిడాల ఇస్తారి తెలిపారు.
- గతంలో కేయూ పాలకమండలి దృష్టికి అనేక ఆరోపణలు వచ్చాయి. భూముల పరిరక్షణకు ఓ వీసీ హయాంలో ల్యాండ్ కమిటీ వేశారు. కమిటీ వీసీ రమేశ్‌కు రిపోర్టును ఇచ్చింది. ఇప్పటివరకు అందులో ఏముంది అనేది పాలకమండలి సమావేశంలో పెట్టకుండా తొక్కి పెట్టారన్న ఆరోపణలున్నాయి.

విజిలెన్స్ విచారణ స్వాగతిస్తున్నా: వీసీ

తెలంగాణ ప్రభుత్వం తనపై నియమించిన విజిలెన్స్ విచారణ స్వాగతిస్తున్నానని కేయూ వీసీ తాటికొండ రమేశ్ శనివారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాను కేయూ వీసీగా మూడేళ్ల పదవీ కాలంలో ఎక్కడా నిబంధలు ఉల్లంఘించలేదని తెలిపారు. ఎన్నో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొని వర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కేయూకు న్యాక్ ఏప్లస్ గ్రేడ్ సాధించడంలో, జాతీయ స్థాయిలో యూనివర్సిటీ హోదా, ప్రతిష్టను పెంచడంలో కృషి చేశానని వివరించారు. తాను వర్సిటీ సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు, పెన్షనర్లకు రావాల్సిన బకాయిలు ఇప్పించానని, 507 మంది దినసరి, లంప్సమ్, క్యాజువల్ ఉద్యోగుల వేతనాలు 3 నుంచి నాలుగురేట్లు పెంచినట్లు పేర్కొన్నారు. పీహెచ్‌డీ అడ్మిషన్లు సైతం సక్రమంగా జరిగినట్లు విచారణ కమిటీ తేల్చినట్లు తెలిపారు. తన హయాంలో వర్సిటీకి చెందిన గుంట భూమి సైతం అన్యాక్రాంతం కాలేదని పేర్కొన్నారు. తన ఆధ్వర్యాన జరిగిన యూనివర్సిటీ అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు ఫిర్యాదు చేశారని తెలిపారు.



సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

ADMISSIONS

- ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ కోర్సులో అడ్మిషన్స్ జరుగుతున్నవి, ఆసక్తిగలవారు కోర్సు పూర్తి చేసి certificate తో పాటు Job placements పొందగలరు. Cont: 9182111578. [W-1242406]

ఉచిత కంప్యూటర్ కోర్స్

- రాజమండ్రిలో ఉచిత కంప్యూటర్ కోర్స్‌తో రెసిడెన్షియల్ బైబిల్ ట్రైనింగ్ 18-35 సం॥లోపు 10 చదివిన స్త్రీ, పురుషులు సంప్ర॥ 7095787706. [W-1264822]

REAL ESTATE

LAND FOR LEASE

- మడికొండ నుండి ఎల్కతుర్తికి BT Road కు నేషనల్ హైవేకు దగ్గర ఉన్న 1.05 ఎకరాల ఓపెన్ ల్యాండ్ కాంపౌండ్ వాల్, 1 రూము ఉన్న ల్యాండ్ స్టాక్ యార్డ్స్, గోదాములకు, సర్వీస్ సెంటర్స్‌కు లీజుకు ఇవ్వబడును. సంప్ర॥ 7093873666. [W-1264896]

HOUSE FOR SALE

- హన్మకొండ వడ్డెపల్లి సప్తగిరి కాలనీలో 150 చ॥గ॥ల పాత ఇల్లు (25x54) గలది అమ్మబడును. (నో బ్రోకర్స్). సంప్ర॥ 9652578381. [W-1242403]

PLOTS FOR SALE

- ఉమ్మడి వరంగల్‌లో KUDA Plots, వ్యవసాయ భూములు, కమర్షియల్ Bits ఇల్లు కొనాలన్న, అమ్మాలన్న TR రియల్ ఎస్టేట్ Property Show కి రండి Here 100% క్లియర్ సం॥ సిరి: 9666864866 [WA-7525]
- GWMC & KUDA అప్రూవ్డ్ లేఅవుట్ చింతగట్టు హన్మకొండలో అన్ని అభివృద్ధి పనులతో ప్లాట్లు అమ్మబడును. గజం కేవలం 15,000/- మాత్రమే. వివరాలకు సంప్రదించండి. 9849992488. [W-1264885]
- హన్మకొండ భీమారంలో నియర్ ఔటర్ రింగ్ రోడ్డుకు 200 చదరపు గజాల ఓపెన్ ప్లాటు అమ్మబడును. నియర్ రిజర్వాయర్ సంప్ర॥ 9849409821. [W-1264888]

TO-LET

- G+2, 3600 Sft గల కమర్షియల్ బిల్డింగ్ ఆఫీస్,బ్యాంక్స్, షాప్‌లకు అనుకూలమైనది కిరాయికి ఇవ్వబడును. Cont: # 19-10-206/1, గవిచర్ల 'X' రోడ్, శంభునిపేట్, WGL. Cell: 9849111183. [W-1242452]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/-రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

SERVICES

CHANGE OF NAME

- I, the undersigned KOMMERA VASANTHA (New Name) previously called Billa Venkata Narsamma (Old Name) and residing at H.No. 5-79, LIC Colony, Gopalpur, Hanamkonda (M), Hanumakonda District - 506009, Telangana State, India and solemnly declare. [W-1264972]

FINANCE

- హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులకు పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్ WGL. 9618767116. [W-1242459]

HEALTH CARE

- ఆత్మీయ రిహాబ్ సెంటర్ యందు వృద్ధులకు మరియు పక్షవాతం, సర్జరీ తరువాత రికవరీ కోసం క్యాన్సర్ పేషంట్స్ కొరకు అవసరమగు 24 గం॥ల సేవలు అందించబడును. ✆ 62814 76205, 94403 25526 [M-11630]

BUSINESS OFFER

- పెట్టుబడి పెట్టండి, అధిక లాభాలు పొందండి, మాది అతి పెద్ద రైస్ & ఫుడ్ బిజినెస్, పార్టనర్స్ కావలెను. రోజూ లారీ రైస్ అమ్మును, 29 వేలు లాభం, రిటైరైన వారు, ఫైనాన్స్ ఇన్వెస్ట్ చేయువారు, కొత్తగా వ్యాపారం పెట్టేవారు, బిజినెస్‌లో ఆసక్తి గల & ఏ జాబ్ లేనివారు డైరెక్ట్ 9989682256 [HA-2223]
- We Are Ready to Invest Long Term Projects All Over the World. Contact: +91 8754809650 [IA-7027]

WANTED

- Suvidyaa Jr College for Girls Wanted LADY WARDENS. Contact No. 8885599244, 8885599155 [W-1242461]
- ప్రముఖ బుక్ పబ్లికేషన్‌లో పనిచేయుటకు లేడీ టీచర్ ట్రైనర్స్ (3) కావలెను. డిగ్రీ, ప్రీ ప్రైమరీ / ప్రైమరీ బోధన అనుభవం. జర్నీ ఇష్టం ఉండాలి. కమ్యూనికేషన్ స్కిల్స్. సెల్: 7382733795 WGL. [W-1242462]
- హవిలా అసోసియేట్ నందు పనిచేయుటకు ఫిమేల్ టెలికాలర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర॥ REC దగ్గర, NIT కాలేజీ ప్రక్కన, HNK # 7981081861. [W-1264821]
- వరంగల్ స్టేషన్ రోడ్డులో గల గోల్డెన్ లాడ్జిలో పనిచేయుటకు మేనేజర్స్ (రిటైర్డ్ ఎంప్లాయిస్), రిసెప్షనిస్ట్ మరియు బాయ్స్ కావలెను. మంచి జీతం. సంప్ర॥ 9391864657. [W-1242456]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

- ఎగ్స్ ట్రేడింగ్ సెంటర్‌నందు టాటా Ace వెహికల్‌లో వెళ్ళుటకు హెల్పర్ (1) కావలెను. Age: 25-40, కాజీపేట్ to వరంగల్ వారికి ప్రాధాన్యత. సంప్ర॥ జులైవాడ, హన్మకొండ. Rahman. 9000992625. [WA-7522]
- మా కంపెనీలో పని చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వయస్సు 18 నుండి 26 సంవత్సరాల లోపు వారు. చదువు అవసరం లేదు. వసతి ఫ్రీ. జీతం: 10000-15000. సంప్ర: 9849316058. [W-1242460]
- ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 9502615217. [M-1185082]
- త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K ఫోన్: 9160900024/9640400073 [H-799880]
- షిర్డిసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ ఆఫీస్ అసిస్టెంట్స్, నర్సులు, లేడీ కేర్ టేకర్స్, ఆయాలు, డ్రైవర్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901 [HA-14041]
- వేద హోంకేర్: హైదరాబాద్ నందు వృద్ధులకు,పేషెంట్లకు సేవచేయుటకు బేబికేర్, ఇంటి/ వంటపనికి స్త్రీ/పు॥ కావలెను. జీతం: 17000 రూం+భోజనం ఫ్రీ ✆ 9177963179 [G-1490]

WANTED TEACHERS

- Wanted teachers to teach 1st to 5th Class English, E.V.S Wardens Male and Female, Cook (Female) 8801802586, 9397696508. [W-1200891]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి గ్రాడ్యుయేట్‌కు ప్రశ్నించే గొంతుక అవుతా..


- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏనుగుల రాకేశ్‌రెడ్డి

నయీంనగర్: తాను ఎమ్మెల్సీగా గెలిస్తే చట్టసభల్లో ప్రతి గ్రాడ్యుయేట్‌కు ప్రశ్నించే గొంతుక అవుతానని బీఆర్‌ఎస్ నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీట్ ది ప్రెస్‌లో ఆయన మాట్లాడారు. తాను గెలిస్తే తన వేతనాన్ని విద్యార్థి, నిరుద్యోగ సంక్షేమ నిధిగా ఏర్పాటుచేస్తానని, ప్రభుత్వం మెడలు వంచి జీఓ 46, 317 రద్దు చేయిస్తానన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే సొంత పార్టీపై ఉద్యోగుల, పట్టభద్రుల డిమాండ్ల సాధనకు పోరాటం చేస్తాడా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే ప్రతిపక్షం ఉండాలన్నారు. బీజేపీ తనని రాజకీయ హత్య చేసి రోడ్డున పడేస్తే బీఆర్‌ఎస్ పార్టీ ఆదుకుందన్నారు. సమావేశంలో ప్రెస్ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, జర్నలిస్ట్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చెట్టు మీదపడి కూలీ మృతి



లింగయ్య (ఫైల్)

రఘునాథపల్లి: చెట్టు మీద పడి ఓ కూలీ మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మండలంలోని కంచనపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలోని వెలబోయిన యాదగిరి తన ఇంటి ఆవరణలోని చెట్టును తొలగించేందుకు అదే గ్రామానికి చెందిన ఇరుగదిండ్ల లింగయ్య (45)ను కూలీకి తీసుకెళ్లాడు. లింగయ్య ఆ చెట్టును రంపంతో కోస్తుండగా తెగి మీద పడింది. దీంతో తీవ్ర గాయాలైన లింగయ్యను జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, లింగయ్యను ఆసుపత్రికి తీసుకెళ్లే సమాచారం ఇవ్వకపోవడంపై మృతుడి కుటుంబ సభ్యులు మండిపడ్డారు. లింగయ్య మృతికి కారణమైన యాదగిరిపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేశారు. మృతుడికి భార్య ఎల్లమ్మ, కూతుళ్లు రజిత, రమ్య ఉన్నారు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు.

భర్త వేధింపులు.. వివాహిత ఆత్మహత్య



వసంత మృతదేహం

పర్వతగిరి : భర్త వేధింపులు భరించలేక మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామానికి చెందిన వసంత (22) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై గుగులోత్ వెంకన్న కథనం ప్రకారం.. రాయపర్తి మండలం వెంకటేశ్వర్లపల్లికి చెందిన శ్రీకాంత్‌తో వసంతకు నెల క్రితం వివాహమైంది. అయితే శ్రీకాంత్ వివాహేతర సంబంధం నెరుపుతూ వసంతను తరచూ వేధిస్తున్నాడు. ఈ విషయమై శ్రీకాంత్‌కు తల్లి కోమల, మేనమామ అంబటి కుమార్ సహకరించేవారు. దీంతో వేధింపులు భరించలేక వసంత శనివారం మధ్యాహ్నం ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.

హసన్‌పర్తిలో చోరీ

- బంగారు, వెండి, నగదు అపహరణ

హసన్‌పర్తి: మండల కేంద్రంలోని నల్లగట్టుగుట్ట సమీపంలో చోరీ జరిగింది. దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై బాధితుడు ఖురేషి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. నల్లగట్టుగుట్ట ప్రాంతానికి చెందిన మహ్మద్ ఖురేషి ప్రైవేట్ ఉద్యోగి. శుక్రవారం రాత్రి భోజనం ముగించుకున్న అనంతరం కూలర్ డోర్‌కు అడ్డంగా వేసి నిద్రించారు. శనివారం ఉదయం లేచి చూసే సరికి బీరువా తీసి కనిపించింది. అందులో ఉన్న సుమారు పదకొండున్నర తులాల బంగారం, 48 తులాల వెండి, రూ.16వేలు నగదు, రెండు మొబైళ్లు మాయమైనట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటనపై క్లూస్ టీమ్ వేలిముద్రలు సేకరించగా పోలీసు జాగిలాలతో గాలింపు చర్యలు చేపట్టారు.

ఈఏపీసెట్ ఫలితాల్లో ఎస్ఆర్ ప్రభంజనం



కె. మణితేజ, దొంతుల మనీష్, తుమ్మ తేజస్వి, ఎం.గణేష్, కె.శ్రీరాంరెడ్డి, చిల్ల హర్షిత



దీపాంశరెడ్డి, కె.వర్షిణి

విద్యారణ్యపురి: టీఎస్ఈఏపీసెట్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ ఎ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి,సంతోష్‌రెడ్డి తెలిపారు. ఈఏపీసెట్ ఫలితాల్లో కొతమ్ మణితేజ ఎంపీసీ విభాగంలో రాష్ట్రస్థాయిలో 9వ ర్యాంకు సాధించారని తెలిపారు. దొంతుల మనీష్ ఎంపీసీ విభాగంలో రాష్ట్రస్థాయిలో 24వ ర్యాంకు, టి తేజస్వి ఎంపీసీ విభాగంలోరాష్ట్రస్థాయిలో 161వర్యాంకు సాధించారని తెలిపారు. మునకాల గణేష్ బీపీసీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 199వ ర్యాంకు, కె శ్రీరాంరెడ్డి ఎంపీసీ విభాగంలో 291వ ర్యాంకు సాధించి రాష్ట్రస్థాయిలో ఎస్ఆర్ విజయపతాకాన్ని ఎగురవేశారని తెలిపారు. అలాగే, చిల్ల హర్షిత 334వ ర్యాంకు, ఆర్ దీపాంశరెడ్డి 412వ ర్యాంకు, కె వర్షిణి 494వ ర్యాంకు, ఎస్ రాహుల్ 546వ ర్యాంకు, జి రాజీవ్ 552వ ర్యాంకు, అబుతాల్హా 554వ ర్యాంకు సాధించారని వారు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ తమ విద్యార్థులకు సృజనాత్మకతతో కూడిన విద్యనందిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో మరిన్ని అత్యుత్తమ ర్యాంకులు సాధించేలా తీర్చిదిద్దుతామని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. 50 సంవత్సరాల్లో పటిష్ట ప్రణాళికతో హైస్కూల్, జూనియర్ కాలేజీ, ఎంసెట్, ఐఐటీల్లో విద్యనందిస్తూ ప్రతి సంవత్సరం, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని వివరించారు. ఈ సంవత్సరం జేఈఈ మెయిన్స్‌లోనూ జాతీయ స్థాయిలోఉత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు.

శివాని విద్యార్థుల విజయదుందుభి



వర్షిత, సాద్విక, అశ్విత, శ్రీజ, శ్వేత, జ్ఞానేశ్వర్

హసన్‌పర్తి: ఈఏపీసెట్ ఫలితాల్లో నగరంలోని శివాని జూనియర్ కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారు. కళాశాలకు చెందిన వర్షిత(3854 ర్యాంకు), చీమకుర్తి సాద్విక(4036 ర్యాంకు), వడ్డెపల్లి అశ్విత(5731 ర్యాంకు), కుసుమ శ్రీజ(6316ర్యాంకు),దాసరి శ్వేత(8917ర్యాంకు), తిప్పారపు జ్ఞానేశ్వర్(9080ర్యాంకు),అరికెళ్ల నిస్సి(9732 ర్యాంకు),రాయబోయిన తిరుపతి(9813ర్యాంకు) తోపాటు 27 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు శివాని విద్యాసంస్థల కరస్పాండెంట్ టి. స్వామి తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాళ్లు, జి.సురేందర్ రెడ్డి, వి. చంద్రమోహన్, డైరెక్టర్లు రాజు, ఎస్.రమేశ్, మురళీధర్, సురేష్, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

షైన్ విద్యాసంస్థల విజయకేతనం



హుమా ప్రియ, ఎండీ. సోహెల్, సరయూరెడ్డి, సిమిరిజ

కాజీపేట అర్బన్ : ఈఏపీసెట్-24 ఎంట్రన్స్ ఫలితాల్లో షైన్ విద్యాసంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని ఆ విద్యా సంస్థల చైర్మన్ మూగుల కుమార్ యాదవ్, డైరెక్టర్లు పి.రాజేంద్రకుమార్, మూగుల రమ, మూగుల రమేష్ తెలిపారు. ఈ మేరకు షైన్ విద్యా సంస్థల ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సభలో వారు మాట్లాడారు. శనివారం వెలువడిన ఈఏపీసెట్-24 ఎంట్రన్స్ ఫలితాల్లో మెడికల్ కేటగిరీలో హుమా ప్రియ 466వ ర్యాంకు, ఎండీ . సోహెల్ 732వ ర్యాంకు, ఆర్.వైష్ణవి 7645వ ర్యాంకు, ధనస్మిత 8525వ ర్యాంకు, ఇంజనీరింగ్ విభాగంలో సరయూరెడ్డి 1370వ ర్యాంకు, సిమిరిజ 1385వ ర్యాంకు, వరుణ్ 3145వ, సీహెచ్.చరణ్ సాయితేజ 6371, ఎస్. సుధాంశ్‌రెడ్డి 6729వ, అక్షయ 8017వ ర్యాంకు, జయంశ్ 9103వ ర్యాంకు సాధించారన్నారు. మెడికల్ కేటగిరీలో 22 మంది విద్యార్థులు 15వేల లోపు ర్యాంకులు, ఇంజనీరింగ్ కేటగిరీలో 36 మంది 15వేల లోపు ర్యాంకులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ మారబోయిన రాజుగౌడ్, కొత్తకొండ శ్రీనివాసన్‌గౌడ్, ప్రవళిక, తదితరులు పాల్గొన్నారు.